క్లుప్తంగా

తప్పుల్లేకుండా నమోదు చేయాలి



ఎంఈఓలతో మాట్లాడుతున్న పరిశీలకుడు

ఆళ్లగడ్డ: ప్రైవేటు పాఠశాలల్లో చదివే ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల ఆన్‌లైన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశీలకుడు విశ్వేశ్వరయ్య ఎంఈఓలకు సూచించారు. పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో నమోదు చేస్తున్న చైల్డ్ ఇన్‌ఫోను పరిశీలించారు. ఇప్పటి వరకు 400 చిన్నారుల వివరాలను నమోదు చేశారన్నారు. వేగవంతంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకుడు కైజర్, ఎంఈఓలు శోభ వివేకవతి, వెంకటరామిరెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధుల రాక

ఉయ్యాలవాడ: మండల కేంద్రానికి ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి బుధవారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో నిర్వహించనున్న సమావేశానికి వారు హాజరు కానున్నట్లు చెప్పారు.

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆళ్లగడ్డ: చాగలమర్రిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మహబూబ్‌బాషా, వెంకట వసంత్‌లు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కోటయ్య మంగళవారం తెలిపారు. గత నెల 20 నుంచి 30 వరకు కాకినాడ లోజరిగిన రాష్ట్రస్థాయి అండర్-17, అండర్-14 విభాగాల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. త్వరలో జాతీయ స్థాయిలో జరిగే ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పీడీ దాదాపీర్, పీఈటీ భారతిలతో పాటు విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

సర్వేలో నిర్లక్ష్యం తగదు



ర్యాలీతో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: లెప్రసీ సర్వేలో నిర్లక్ష్యం తగదని గోస్పాడు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గోపాల్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ వరకు లెప్రసీ సర్వేను సిబ్బంది ఇంటింటికి తిరిగి సక్రమంగా చేపట్టాలన్నారు. లెప్రసీ వ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్న వారి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. లెప్రసీ లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, ఉచిత చికిత్సల గురించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు.

ఉపాధ్యాయులను నియమించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు

గోస్పాడు: ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు సర్దుబాటు పూర్తయిన తర్వాత ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిన పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రభుత్వం 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులను మొదటగా ఏకోపాధ్యాయ పాఠశాలలకు రోల్‌తో సంబంధం లేకుండా నియమించాలని కోరారు. ఒకే ఉపాధ్యాయుడు 5 తరగతులు నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. దీంతో పాటు యాప్స్ పంపడానికి తరగతుల నిర్వహణకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

నంద్యాల(సిటీ): పట్టణంలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే భూమ బ్రహ్మానందరెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలిసి పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో ఎక్కడా నీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే పట్టణంలో ప్రతి గృహానికి తాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

చేసిన మేలునే చెబుదాం

- ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం చేసిన మేలునే ప్రజలకు చెప్పి, మరోసారి అండగా నిలవాలని కోరాలని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశం ఎమ్మెల్సీ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చారన్నారు. పార్టీలకు అతీతంగా, అవినీతికి తావులేకుండా ప్రభుత్వ పథకాలను ప్రతి పేదవాడి దరికి చేర్చారన్నారు. అలాంటి జగనన్నను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు ఉన్నా పక్కన పెట్టి పార్టీ కోసం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఈనెల 11న మా నమ్మకం నీవే జనన్న కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. ఈ కార్యక్రమం నాలుగురోజులు పాటు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు భాగమై ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చామన్నారు. చంద్రబాబు చేసిన మోసాలు.. మన ప్రభుత్వం చేసిన మంచి పనులతో ముద్రించిన పత్రాన్ని ఇంటికి అందజేయాలన్నారు. 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిశీలికుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చామన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకుని మనం చేసిన పథకాలను వివరిస్తున్నారన్నారు. గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి బాధ్యతగా 10 నిమిషాలు వారితో మాట్లాడి పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వర రావు, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు శివరామిరెడ్డి, మోహన్‌నాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీ కం బ్రిడ్జి నిర్మించాలి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): సిద్ధేశ్వరం వద్ద బ్యారేజీ కం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. నంది రైతు సమాఖ్య సభ్యులు కృష్ణారెడ్డి, మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ సిద్ధేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజీలు నిర్మించి రాయలసీమ ప్రజల రైతాంగ అవసరాలు తీర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండా మోహన్‌రెడ్డి, హరినాథరెడ్డి, జయరామిరెడ్డి, ఓబులపతి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



మహిళకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నెకు చెందిన మంగలి సుబ్బలక్ష్మికి ఎమ్మెల్సీ, శాసన మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి కలిసి మంగళవారం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కును అందజేశారు. ఇటీవల ఆమె భర్త మంగలి వెంకటసుబ్బయ్య రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం కమిటీ సభ్యులు గోపిరెడ్డి పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, మాధవ తదితరులు ఉన్నారు.

స్వామి వచ్చాడు.. సంతోషం తెచ్చాడు

- సర్వాయిపల్లెకు చేరిన పార్వేట పల్లకీ



గ్రామ పొలిమేర తెరుపు వద్ద హారతి ఇచ్చి పూజలు చేస్తున్న పండితులు

ఉయ్యాలవాడ: అహోబిళం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవాల్లో భాగంగా స్వామివారి పల్లకీ మంగళవారం మండలంలోని సర్వాయిపల్లె గ్రామానికి చేరుకుంది. గ్రామస్తులు, అధికారులు ఉత్సవ మూర్తులకు ఎదురేగి తెరుపు వద్ద స్వాగతం పలికారు. ఆళ్లగడ్డ మండలం ఎస్ లింగందిన్నె గ్రామం నుంచి సర్వాయిపల్లెకు చేరుకోవడంతో పూర్వాచారం ప్రకారం గ్రామానికి చెందిన సన్నిధి సుబ్రమణ్యం స్వామి గృహం నుంచి నూతన వస్త్రాలు, తాంబూలాలు, మేళతాళాలతో వచ్చి తెరుపు వద్ద ప్రహ్లాద వరదస్వామి, జ్వాల నరసింహస్వామికి మొదటి పూజ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్‌ఐ తులసికృష్ణ, ఎస్‌ఐ సత్యనారాయణ, సర్పంచ్ ఉమా దంపతులు, మాజీ సర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, అధికారులు పాల్గొని పూజలు చేశారు.

స్వామివారి విశిష్టత

పార్వేట పల్లకీ ఉత్సవాల్లో భాగంగా సంక్రాంతి పర్వదినాన అహోబిళం కొండ దిగి బాచాపురంలో మొదటి పూజలందుకున్నారు. గ్రామగ్రామాన తిరుగుతూ 25 రోజుల తర్వాత సర్వాయిపల్లెకు చేరుకున్న స్వామివార్లకు ఏ గ్రామంలో కూడా తిరుమంజనం నిర్వహించరు. కేవలం ఈ గ్రామంలో పూర్వ ఆచారం ప్రకారం కోనేటి నీటితో ఉత్సవ మూర్తులకు పాలు, తేనె, గంధం, పండ్లు, పెరుగు తో పుణ్య స్నానాలు చేయిస్తారు. నూతన వస్త్రాలు అలంకరించి ఏకాంత అభిషేకాలు చేపట్టడం ఈ గ్రామ ప్రత్యేకత అని పండితులు టిడాంబీ మధుసూదన్, నరసింహ తెలిపారు. బుధవారం పుల్క స్నానం అనంతరం పార్వేట ఉత్సవ మూర్తులకు గ్రామోత్సం నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 4వ గ్రామ సచివాలయ పరిధిలోని చేపలపేట, జెండాపేటలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. పథకాలు అందున్నాయా లేదా, సమస్యలు ఏవైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. నియోజకవర్గంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు కృషి చేశామన్నారు. మన బడి నాడు- నేడు కింద పాఠశాలల రూపు రేఖలను మార్చామన్నారు. 759 మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశామన్నారు. రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక

తెలుగు యువత నాయకుడు, 14వ వార్డు మాజీ మెంబర్ బుగ్గానిపల్లె అల్లాబకాష్, అతని అనుచరులు మంగళవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. తెలుగు యవత నాయకునతో పాటు బుగ్గానిపల్లె హిదాయతుల్లా, అప్సర్, మహమ్మద్ షిల్లార్, షేక్ అన్వర్, కులుకు నబీసాహెబ్, జాకీర్, కలీల్ అహమ్మద్, సులేమాన్, భాషా, చాంద్‌భాషా, కులుకు కలాం, రఫీ, నొమాన్, సమీవుల్లా, ఆరీఫ్, షబ్బీర్, అక్రం తదితర 20 కుటుంబాలు పార్టీలో చేరాయి.



వృద్ధురాలిని పలుకరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

పన్ను వసూళ్లలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): పన్ను వసూళ్లలో అలసత్వం వీడాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి సంబంధించిన పన్నులను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. ఇప్పటికే పట్టణంలో 14 శాతం పన్నుల వసూళ్లలో జాప్యం జరిగిందని, వారంలోపు ఆయా భవన యజమానుల వివరాలు సేకరించి మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్ను వసూలు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహ మూర్తి, టీపీఓ రాణెమ్మ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాలల ద్రోహి చంద్రబాబు



మాట్లాడుతున్న జాతీయ నాయకులు చెన్నయ్య

నంద్యాల(రూరల్): ఎస్సీ వర్గీకరణ పేరిట కబుర్లు చెబుతున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాలల ద్రోహి అని, ఎస్సీ వర్గీకరణ భారత రాజ్యాంగానికి వ్యతిరేకమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ లాడ్జ్ సమావేశ భవనంలో నంద్యాల జిల్లా మాల కులస్తుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, ఉమ్మడి రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మేకల లింగస్వామిలు హాజరయ్యారు. చెన్నయ్య మాట్లాడుతూ దేశంలోని మాల కులస్తులు ఐకమత్యంగా ఉంటూ ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులు రాజకుమార్, ఉపాధ్యక్షులు రాముడు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ



అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకే నిధుల తగ్గింపు

నంద్యాల(అర్బన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకే బడ్జెట్‌లో నిధులను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆరోపించారు. కోట్లాది మందికి పనులు కల్పిస్తున్న ఉపాధి హామీకి నిధుల కేటాయింపుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఉపాధి నిధుల కేటాయింపును నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 30 కోట్ల మందికి పైగా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో జాబ్ కార్డులు కలిగి ఉన్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి దాదాపు 2.40 లక్షల కోట్లు అవసరమవుతాయన్నారు. ఈ ఏడాది 60 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టడం కూలీలకు జీవన్ మరణ సమస్య అయ్యేలా ఉందన్నారు. కేంద్రం పునరాలోచన చేసి బడ్జెట్ పెంచాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబాఫకృద్దీన్, సుబ్బరాయుడు, లక్ష్మిదేవి, హరి, సోమన్న, శ్రీనివాసులు, సురేష్, ఏసేబు, ప్రతాప్ పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.6.71 లక్షల ఆదాయం

బొమ్మలసత్రం: నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో సరైన పత్రాలు లేని వాహనాలకు డీఎస్పీ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేలం పాటలో పోలీసు శాఖకు రూ.6.71లక్షలు ఆదాయం లభించినట్లు డీఎస్పీ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహించిన సమయంలో సరైన పత్రాలు లేని వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వాటిని యజమానులు తీసుకోకపోవడంతో మంగళవారం డీఎస్పీ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. దాదాపు 93 వాహనాలను వేలం వేయగా రూ.6.71 లక్షలు ఆదాయం లభించిందని, ఈ నగదును ప్రభుత్వానికి డిపాజిట్ చేశామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐలు నరసింహులు, కృష్ణయ్య, రవీంద్ర, ఎస్‌ఐలు సుబ్బిరామిరెడ్డి, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో ఆధార్ సేవలు

నంద్యాల(సిటీ): పట్టణంలోని జూనియర్ కళాశాలల్లో మొబైల్ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో అందిస్తున్న ఆధార్ సేవలను మరింత విస్తృతం చేస్తూ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఆధార్ అప్డేషన్ సేవలను మొబైల్ ఆధార్ కేంద్రాల ద్వారా కళాశాలల్లో అందిస్తున్నామన్నారు. ఆధార్‌కు సంబంధించిన ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేట్, బయోమెట్రిక్ అప్డేషన్ వంటి 6 రకాల సేవలు మొబైల్ ఆధార్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

చైల్డ్ ఇన్‌ఫోలో నమోదు చేయాలి

నంద్యాల(అర్బన్): ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారుల పేర్లను ఆన్‌లైన్(చైల్డ్ ఇన్‌ఫో)లో తప్పక నమోదు చేయాలని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అబ్జర్వర్ విశ్వేశ్వరయ్య పేర్కొన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో ప్రీ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, డేటాలను ఆయన పరిశీలించారు. అనంతరం విశ్వేశ్వరయ్య మాట్లాడుతూ ప్రతి పాఠశాల విద్యార్థి బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డుతో పాటు కుల ధ్రువీకరణ పత్రాన్ని పాఠశాలలో తప్పక ఇవ్వాలన్నారు. విద్యార్థుల డేటాలను సక్రమంగా నమోదు చేయకపోతే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి, ఎంఈఓ బ్రహ్మంనాయక్, ఏఎస్ఓ కైసర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రోగులకు హెపటైటిస్ వ్యాక్సిన్



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: హెచ్‌ఐవీ, హైరిస్క్ ఉన్న వారికి హెపటైటిస్ బి వ్యాక్సిన్‌ను అన్ని ఏఆర్‌టీ సెంటర్లలో ఉచితంగా అందిస్తామని జిల్లా లెప్రసి, టీబీ ఆఫీసర్ డాక్టర్ బాలాజీ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ చేతుల మీదుగా స్థానిక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నేషనల్ హెల్త్‌మిషన్, నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. హెచ్‌ఐవీ, సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్ జెండర్లు, వలసదారులు ఈవ్యాక్సిన్‌ను ఉచితంగా పొందవచ్చన్నారు. హెపటైటిస్ బి వ్యాధి కాలేయ సంబంధిత వ్యాధి అని రోగి నుంచి మరొకరికి రక్తం, వీర్యం, ఇతర శరీర ద్రవాల నుంచి వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి లక్షణాలు జ్వరం, అలసట, ఆకలి మందగించటం, వికారం వాంతులు, కడుపు నొప్పి, మూత్రం రంగుమారటం, కామెర్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

నంద్యాల(సిటీ): పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ అన్నారు. మంగళవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో సచివాలయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ నంద్యాల మండలంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు అందుతున్న లబ్ధిని చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు రోజువారీ మెనూ అందుతుందా లేదా అని చూడాల్సిన బాధ్యత సెక్రటరీలదేనన్నారు. నాడు-నేడు ద్వారా జరుగుతున్న పాఠశాలల ఆధునీకరణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలన్నారు. పాఠశాలకు సంబంధించిన రోజువారి కన్సిస్టెంట్ రిథమ్(సీఆర్) రిపోర్ట్‌ను ప్రతి రోజూ ఇవ్వాలన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. సమావేశంలో ఏఎంఓ లలితాకుమారి, డిప్యూటీ ఈఓ మహబూబ్ బేగ్, ఏపీఎం గుర్రప్ప, సీఆర్పీలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆళ్లగడ్డ: పట్టణంలోని కీర్తన స్కూల్ సమీపంలో ఓ ఇంట్లో నుంచి లారీకి లోడ్ చేస్తున్న సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి కొందరు వ్యక్తులు లారీలో లోడ్ చేస్తుండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన ఎస్‌ఐ అక్కడికి చేరుకునే సరికి లోడ్ చేస్తున్నవారు పరారయ్యారు. దీంతో బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

గోస్పాడు: విద్యుత్ వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించేలా చూడాలని ఏఈ జ్ఞాన సూర్యుడు సూచించారు. మంగళవారం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు సంబంధిత విద్యుత్ బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించకపోయినా, అక్రమంగా విద్యుత్ వాడుతున్నా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది గ్రామాల్లో విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి అవసరమున్నంత వరకే విద్యుత్ వాడేలా అవగాహన కల్పించాలన్నారు.

నేడు ఎస్‌వైవీసీపీ కళాశాల ప్రారంభం

నంద్యాల(అర్బన్): పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలోని ఎలుకూరి వాసుదేవయ్య శ్రేష్టి పార్వతమ్మ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల(ఎస్‌వైవీసీపీ) నూతన భవన సముదాయాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. 1978-79లో ఎస్‌వైవీసీపీ పేరుతో ప్రభుత్వ బాలికల ప్రభుత్వ బాలికల కళాశాల ఏర్పాటైంది. 50 మంది బాలికలతో పాలిటెక్నిక్ వర్క్‌షాపుల్లో ప్రారంభమైన కళాశాలకు స్వచ్ఛంద సంస్థలు, నాయకులు అధ్యాపక, వ్యాపార వేత్తల సహకారంతో పూర్తిస్థాయి భవనాలు ఏర్పాటయ్యాయి. భవనాల ఏర్పాటుకు ఆర్‌డీటీ రూ.2.5 కోట్లు సాయం అందించింది. నూతన భవనాల ప్రారంభోత్సవానికి ఆర్‌డీటీ నిర్వాహకులతో పాటు నంద్యాల ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.